క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని కోనాయపల్లి, చౌలపల్లి, బోధునంపల్లి, లేమామిడి, నిర్దవెళ్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి శనివారం పరిశీలించారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పోషణ్ అభియాన్‌లో సూపర్‌వైజర్ దివ్య



పోషణ్ అభియాన్‌లో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది

కేశంపేట: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కేశంపేట సెక్టార్ సూపర్‌వైజర్ దివ్య అన్నారు. మండల పరిధిలోని నిర్దవెళ్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివ్య పాల్గొని పోషకాహారం తీసుకోవడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడంతో రక్తహీనతతో పాటు పోషకాహార లోపం వంటి సమస్యలను అధిగమించవచ్చన్నారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలని, అప్పుడే పుట్టిన పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతారని తెలిపారు. అంగన్‌వాడీల్లో అందించే పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత



దాతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చేవెళ్ల: గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు అందించే సహకారం మరువలేనిదని మాజీ సర్పంచ్ ఆర్ మధుసూదన్‌గుప్తా అన్నారు. మండలంలోని దామరగిద్దలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన గణపురం శేఖర్ వాటర్ ఫిల్టర్‌ను మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో శనివారం దాత తన తండ్రి బాలయ్య చేతుల మీదుగా ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులందరిపై ఉందన్నారు. గతంలో పాఠశాలకు వాల్ బోర్డును, వాటర్ బాటిళ్లను అందజేశారని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా పాఠశాల అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. శేఖర్‌ను గ్రామస్తులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎర్రవల్లి మల్లేశ్, తెలుగు అంజయ్య, దర్శన్, రాములు, యాదయ్య, రామస్వామి ఉన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు

బాలాపూర్ చౌరస్తాను పరిశీలించిన ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: బాలాపూర్ చౌరస్తాలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నూతన సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం ట్రాఫిక్ పోలీస్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే బాలాపూర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యను పరిశీలించారు. ఈ చౌరస్తాలో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా మారిందని, దీంతో నిత్యం అవస్థలు పడుతున్నామని ప్రజలు తన దృష్టికి తెచ్చారని, త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. రానున్న రోజుల్లో ట్రాఫిక్ రహిత చౌరస్తాగా మార్చడంతో పాటు జంక్షన్‌గా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు.అదేవిధంగా ఇక్కడున్న వీధి వ్యాపారస్తులను వ్యాపార సముదాయాల్లోకి తరలిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, ట్రాఫిక్ సీఐ మల్లు, ఎస్‌ఐ సుధాకర్, కమిషనర్ చంద్రశేఖర్, డీఈ వెంకన్న, ఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

సీనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న జడ్జి రాజ్యలక్ష్మి

షాద్‌నగర్: రాజీమార్గమే రాజమార్గమని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 28న నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమానికి సంబంధించి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జడ్జి రాజ్యలక్ష్మి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న తగాదాలు, ఘర్షణలు పడి ప్రజలు పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు. ఒక కేసులో రాజీ పడటం ద్వారా ఇరువర్గాలు ఆ కేసులో గెలిచినట్లేనన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికి జీవించే హక్కు, సమానత్వం హక్కు ఉంటుందన్నారు. వాటిని భంగం కలిగినప్పుడు కోర్టును ఆశ్రయించాలని సూచించారు. పోలీసు అధికారులు కోర్టులు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు వారికి అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి సూరజ్ సింగ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ధీరజ్‌కుమార్, పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్‌ఐలు సుశీల, విజయ్‌కుమార్, కృష్ణయ్య, మురళీగౌడ్, ఏఎస్‌ఐలు శ్రీనివాస్, శ్రీరాములు, నర్సింలు, రూరల్ సీఐ సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గౌడసంఘాల అభివృద్ధికి కృషి

ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



మంత్రి జూపల్లి కృష్ణారావును సన్మానిస్తున్న మల్లేశ్‌గౌడ్ తదితరులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో గౌడల అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా తనవంతు కృషి చేస్తానని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు మల్లేశ్‌గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నక్కలపల్లి అంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా, మండల కమిటీ గౌడ కులాల సంఘం సభ్యులతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా గౌడ కులాలకు ఉన్న సమస్యలను లిఖితపూర్వకంగా రాసి అందజేశారు. అందులో భాగంగా మండలంలోని టీఎఫ్‌టీ, సొసైటీ వారికి సంబంధించి ఈత వనాలను పెంచుకోవడానికి ప్రతి సొసైటీకి ఐదెకరాల ప్రభుత్వ భూమిని ఇవ్వాలని, గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరుతూ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి గౌడ సంఘం సభ్యులతో మాట్లాడుతూ.. గౌడల అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఎలిగని వెంకటేశ్‌గౌడ్, నర్సింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బోగస్ ఓట్లను తొలగించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కేశంపేట: బోగస్ ఓట్లను తొలగించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు రొల్ల రఘురాంగౌడ్ శనివారం తహసీల్దార్ అజాంఅలీకి వినతిపత్రం అందించారు. బీఎల్‌ఓల ద్వారా క్షేత్రస్థాయిలో ఓటర్‌ను పరిశీలన చేసి డబుల్ ఓట్లతో పాటు గుర్తుతెలియని వ్యక్తుల ఓట్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగారెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

- భయాందోళనలో రైతులు
- ఇరవై రోజులైనా పట్టించుకోని అధికారులు



నాగిరెడ్డిగూడలో ఒరిగిన 11కేవీ విద్యుత్ లైన్ స్తంభం

మొయినాబాద్: ఈదురుగాలులు, వర్షాల కారణంగా ఒరిగిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. సుమారు ఇరవై రోజులుగా తీవ్ర భయాందోళన, ఇబ్బందులకు గురవుతున్న రైతులు విద్యుత్ అధికారులకు విన్నవించినా వారి చెవికెక్కడం లేదు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో వ్యవసాయ పొలాల వైపు వెళ్లిన 11కేవీ విద్యుత్ లైన్‌లో గత ఇరవై రోజుల క్రితం కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బలమైన ఈదురుగాలులు, వర్షాల కారణంగా నాలుగు స్తంభాలు ఒరిగి విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వరిచేల్లో వేలాడుతున్నాయి. స్తంభాలు ఒరిగిన రోజే లైన్‌మెన్, అధికారులకు స్థానిక రైతులు సమాచారం ఇచ్చారు. వెంటనే స్తంభాలను సరిచేసి మరమ్మతులు చేయిస్తామని చెప్పిన విద్యుత్ అధికారులు ఇప్పటివరకు చేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. 11 కేవీ విద్యుత్ లైన్ కావడంతో అటు వైపు వెళ్లాలంటేనే భయమేస్తోందని.. స్తంభాలు పూర్తిగా కింద పడితే గేదెలు, ఆవులు, గొర్రెలు, రైతులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ఒరిగిన 11కేవీ విద్యుత్ లైన్ స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోశాధికారి బండారి రమేశ్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోశాధికారి బండారి రమేశ్ అన్నారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని గంజ్ ఆవరణలో ఉన్న గణపతి దేవాలయంలో సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో బండారి రమేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రాశ్చాత్య పోకడలతో దేశ సంస్కృతి సంప్రదాయాలను మరిచిపోతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కౌన్సిలర్ కొందూటి మహేశ్వరీ, అభిలాశ్, సుజీవన్, అనిల్, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, మనోహర్ రాజు, గడవాడ నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్, శ్రీధర్, ఆలయ ట్రస్టు సభ్యులు ఓంప్రకాశ్, కుమార్, అర్చకుడు రాజన్ పండిత్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు కొండా లక్ష్మణ్



బాపూజీ వర్ధంతిలో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్: తొలి, మలి దశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదర్శప్రాయుడని పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కోట జనార్దన్ అన్నారు. శనివారం బాపూజీ వర్ధంతిని పట్టణంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న బాపూజీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోట జనార్దన్ మాట్లాడుతూ.. తెలంగాణలో సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన మహనీయుడన్నారు. బాపూజీ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఒగ్గు కిషోర్, ప్రధాన కార్యదర్శి చెన్న బాల్‌రాజ్, బాస రాజేందర్, పులిపాటి నర్సింలు, బుచ్చయ్య, వర్కల శ్రీనివాస్, బాలకృష్ణ, పాండురంగయ్య, అంజయ్య, పాలాది శివ, శ్రీశైలం, రాములు, చెరుకు కిరణ్, వెంకటేశ్, పల్లాటి అంజయ్య, నర్సింలు, పల్లాటి లక్ష్మీనారాయణ, అంజయ్య, దాస రమేశ్, రాజు, భాస్కర్, బాలు, నర్సింలు, యాదగిరి, దిడి గోపాల్, శారద, కీర్తన, స్వాతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు



ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

షాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ హెడ్ సురేఖ, మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో భాస్కర హాస్పిటల్, శ్రీ బాలాజీ దంత వైద్యశాల వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 69 మంది వరకు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సాయికృష్ణ, ప్రసన్న, వెల్‌స్పన్ ఫౌండేషన్ సిబ్బంది శిరీష, భాస్కర్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముద్దెంగూడలో..

షాబాద్: పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామంలో చేవెళ్లకు చెందిన పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 269 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అందులో 42 మందికి వారంరోజుల తర్వాత ఆస్పత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

గ్యాస్ కనెక్షన్ బాండ్‌ల పంపిణీ



మహిళలకు బాండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కొందుర్గు: మండలంలోని రేగడిచిల్కమర్రిలో కాంగ్రెస్ నాయకుడు పురుషోత్తంరెడ్డి శనివారం మహిళలకు గ్యాస్ కనెక్షన్ బాండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. అందులో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500లకు గ్యాస్ సిలిండర్ ఇస్తుందన్నారు. అధికారం చేపట్టగానే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని, ప్రజాసంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణరెడ్డి, శ్రీను, రాజేందర్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్



నూతన కమిటీ సభ్యులతో శ్రీకాంత్

షాద్‌నగర్: విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. దీంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేద విద్యార్థులను విద్యతో ప్రోత్సహించే విధంగా గత ప్రభుత్వాలు ప్రైవేట్ కళాశాలల్లో చదువుకోవడానికి స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చాయని తెలిపారు. కానీ నేటి ప్రభుత్వాలు ఈ పథకాలను తుంగలో తొక్కాయన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేయాలని డిమాండ్ చేశారు. సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ షాద్‌నగర్ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా సుమయిర్, కార్యదర్శిగా శివశంకర్, ఉపాధ్యక్షులుగా సాయి, సాగర్, రాధాకృష్ణ, తరుణ్, సహాయ కార్యదర్శులుగా మహేందర్, ముద్దసిర్, అస్లాం, అఖిల్, జశ్వంత్, సభ్యులుగా యశ్వంత్, ఆదిల్, సుభాన్, అశోక్, వినయ్, శివ, రితీశ్, రమేశ్‌లను ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చౌదరిగూడ సబ్‌స్టేషన్‌లో పలు మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చౌదరిగూడ సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా జరిగే గ్రామాల వినియోదారులు తమకు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ కమిటీ సభ్యులు



ఎమ్మెల్యే కాలె యాదయ్యను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

చేవెళ్ల: వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం శనివారం ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి సన్మానించారు. నూతన పాలకవర్గ చైర్మన్ గడ్డమీది పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బ్యాగరి రాములు, డైరెక్టర్లు శనివారం ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఆయనను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్కెట్ నూతన పాలకవర్గంలో ఎంపికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రైతుల సమస్యలపై పాలకవర్గం దృష్టి సారించాలని తెలిపారు. త్వరలోనే పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు తీగ యాదిరెడ్డి, లలితరాములు, బాలయ్య, నరేందర్, ఎండీ హనీఫ్, వీరేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డి, తదితరులు

జిల్లా అధికార ప్రతినిధి కందూరు శ్రీధర్‌రెడ్డి

షాబాద్: బీజేపీ జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు ప్రతి బూత్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా అధికార ప్రతినిధి కందూరు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని చెప్పారు. 10 ఏళ్ల కాలంగా బీజేపీ ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికి తెలియజేసి పార్టీలో చేర్పించాలని సూచించారు. చేవెళ్లలో అత్యధిక పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ఆకర్షితులై నేడు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పార్టీలో సభ్యత్వం పొందుతున్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల వరకు బీజేపీ క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదె మహేశ్, ప్రధాన కార్యదర్శి హరీశ్, నాయకులు నరేశ్, నవీన్, విష్ణు, రాము, రఘు, నరేశ్ తదితరులు ఉన్నారు.

ఎర్రం చెరువు పరిధి గుర్తింపు



చెరువు భూములను పరిశీలిస్తున్న అధికారులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం జిల్లేడ్ గ్రామ శివారులో గల ఎర్రం చెరువు శిఖం భూమిని శనివారం ఇరిగేషన్ ఏఈ సింధు, ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో సర్వేయర్ ఆంజనేయులు కొలతలు చేసి చెరువు పరిధిని గుర్తించారు. ఈ సందర్భంగా సర్వేయర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 145లో 9 ఎకరాల 17 గుంటల శిఖం భూమి ఉందని తెలిపారు. చెరువు భూమి అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు కొలతలు చేసి హద్దులు నిర్ణయిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా గణనాథుడి నిమజ్జనోత్సవం



షాద్‌నగర్: లడ్డూ దక్కించుకున్న డీజే అంజి



షాబాద్: గణనాథుడి లడ్డూ దక్కించుకున్న తిరుపతిరెడ్డి

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో ఉన్న చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకీ సేవ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు రఘుపతిశర్మ, రాఘవేంద్రచార్య, కృష్ణ, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన లడ్డూ వేలం పాటలో పట్టణానికి చెందిన డీజే అంజి రూ.40వేలకు వేలం పాడి స్వామివారి ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీశైలంగౌడ్, రఘుగౌడ్, రమేశ్, రఘునందన్‌రెడ్డి, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, కృష్ణయ్య, లక్ష్మీకాంత్, కృష్ణాచారి, శంకరయ్య యాదవ్, బచ్చన్న, గోరియా నాయక్, సత్తయ్య, శ్రీనివాస్, రమేశ్, సుధాకర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, రవీందర్, సింగపాగ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసారంలో..

షాబాద్: మండల పరిధిలోని కేసారం గ్రామంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి 14 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన లడ్డూ వేలం పాట పోటాపోటీగా సాగింది. వేలంలో ఆశమ్మగారి తిరుపతిరెడ్డి పాల్గొని రూ.41వేలకు లడ్డూ దక్కించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.